మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

చంద్రబాబుకు దమ్ముంటే దగ్గరుండి నామినేషన్ వేయించాలి

- తన పాలన మీద నమ్మకం ఉంటే ఎన్నికలు స్వేచ్ఛగా జరగనివ్వాలి
- నామినేషన్ వేసే అభ్యర్థులకు రక్షణ లేకపోగా పోలీసుల ఎదుటే దాడులు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రైవేట్ సెక్యూరిటీ తెచ్చుకోవాల్సిన దుస్థితి
- తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే జగన్ పై చంద్రబాబు విమర్శలు
- ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి ధ్వజం



వైఎస్సార్ కడప: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే ప్రతిపక్ష అభ్యర్థులకు రక్షణగా నిలబడి దగ్గరుండి మరీ నామినేషన్లు వేయించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. వైఎస్సార్ కడప జిల్లాలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అధికార పార్టీ, కొందరి అధికారులు కలిసి ఎంత పరాకాష్టకు, ఎంత నికృష్ట స్థాయికి దిగజార్చారో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. భారత ప్రజాస్వామ్యంలో ఏజెన్సీ ప్రాంతాలలో, మారుమూల అడవులలో కూడా ఓటు హక్కు వినియోగించుకునే గొప్ప వెసులుబాటు ఎన్నికల సంఘం కల్పిస్తుందని, కానీ నేడు చంద్రబాబు కూటమి పాలనలో కనీసం నామినేషన్ కూడా వేయనివ్వని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

జగన్ గారి ప్రజాదరణ తగ్గించి చూపే కుట్రలు:

వైఎస్ జగన్ గారి ప్రజాదరణను తగ్గించేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారు. తన ప్రభుత్వ అసమర్థతను, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు జగన్ గారిపై నిందలు వేస్తున్నారు. కడప జిల్లా నుంచి మొదలుపెట్టి పుంగనూరు మీదుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భయపెట్టడం, నామినేషన్లు వేయకుండా నిరోధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం వెసులుబాటు కల్పించే వ్యవస్థ మనది. అలాంటిది మన రాష్ట్రంలో అభ్యర్థులకు నామినేషన్ వేసే అవకాశం కూడా ఇవ్వని పరిస్థితులు కల్పించడం దుర్మార్గం. చంద్రబాబుకు ధైర్యముంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకోవడం మానేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో ఆయనే దగ్గరుండి నామినేషన్లు వేయించాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష అభ్యర్థులను అడ్డుకోవడం ఎందుకు?

ఎస్వీనే నామినేషన్లు అడ్డుకున్నారు:

పులివెందుల మున్సిపాలిటీలో మొదటి రోజే మా చైర్మన్ అభ్యర్థితో పాటు 22 మంది కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన 18 వార్డుల్లో నామినేషన్లు వేసేందుకు వెళ్లినప్పుడు పోలీసులు సమయం ఇస్తామని చెప్పి, ఆ తర్వాత మమ్మల్ని కార్యాలయంలోకి వెళ్లనివ్వలేదు. జిల్లా ఎస్పీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సమయం ఇస్తామని హామీ ఇచ్చి ఆ హామీని నిలబెట్టుకోకుండా అభ్యర్థులను అడ్డుకోవడం వెనుక ఎవరి ఒత్తిడి ఉంది? నిరసన సమయంలో టియర్ గ్యాస్ ప్రయోగించడం, గాల్లోకి కాల్పులు జరపడం వంటి ఘటనలపై సమగ్ర విచారణ జరగాలి. పోలీసులే రాళ్లు విసిరి, తిరిగి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై దాడి చేశారంటూ ఆరోపణలు చేయడం, హత్యాయత్నం కేసు నమోదు చేసి 600 నుంచి 700 మందిని నిందితులుగా చేర్చినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

ప్రజాస్వామ్యంపై గౌరవం ఉందా?

రాయచోటిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కార్లపై పెట్రోల్ బాంబులు విసిరి నిప్పంటించిన ఘటనపై కూడా సమగ్ర విచారణ జరగాలి. స్థానికంగా పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో తెలుసుకోకుండా, పంజాబ్, బీహార్ నుంచి గూండాలను తీసుకొచ్చారని చంద్రబాబు వక్రీకరణలు చేయడం ఏమిటి? భద్రత కోసం వచ్చిన సిబ్బంది వివరాలను పరిశీలించి వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై లేదా? ప్రజాస్వామ్యంపై గౌరవం ఉన్న వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలి.

టీడీపీ గూండాలు రాడ్లతో తిరుగుతుంటే..

కడప, రాజంపేట, రాయచోటి, పుంగనూరు, తిరుపతి, పల్నాడు, బద్వేలు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, పులివెందుల ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా దాడులు, బెదిరింపులు, నామినేషన్ల అడ్డగింతకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. టీడీపీ పర్గాలు కర్రలు, కత్తులు, రాడ్లతో తిరుగుతున్నాయనే ఆరోపణలు వస్తుంటే, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మాత్రం సెక్షన్ 144 పేరుతో ఆంక్షలు విధిస్తున్నారు. చంద్రబాబుకు నిజంగా ప్రజాబలం ఉందని నమ్మకం ఉంటే, పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని నామినేషన్లు అడ్డుకోవడం, ప్రతిపక్ష అభ్యర్థులను కేసులతో భయపెట్టడం మానుకోవాలి. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే అవకాశం కల్పించాలి.

Main Edition
19 Oct 2026 Page No. 10